# లేబర్ కోడ్స్ బిల్లును వెంటనే రద్దు చేయాలి

## సిఐటియు ఆధ్వర్యంలో అద్దంకి మున్సిపల్ కమిషనర్ సమ్మె నోటీసు అందజేత






**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ ఫిబ్రవరి 5:**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ బిల్లును వెంటనే రద్దు చేయాలని సిఐటియు అద్దంకి మండల కార్యదర్శి తంగిరాల. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, నాయకులు కమిషనర్ రవీంద్రను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం జరిగిన నిరసనలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్రంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని విమర్శించారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ బిల్లులను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం యొక్క ఈ దుర్మార్గ వైఖరిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, కార్మిక హక్కుల రక్షణ కోసం ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఉపాధి హామీ పథకం నిర్వీర్యం**

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వ్యవసాయ కూలీలకు ఎంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం పేరు మార్చడంతో పాటు, రెండు పూటలా 'పేస్ యాప్' ద్వారా హాజరు వేయాలనే నిబంధన తీసుకురావడం కూలీలను ఇబ్బందులకు గురిచేయడమేనని అన్నారు. ఇది ముమ్మాటికీ ఉపాధి హామీని నీరుగార్చే కుట్ర అని ఆయన అభివర్ణించారు.

?ఈ సమ్మెలో మున్సిపల్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్రం మెడలు వంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఉత్తమ మార్కులతో ఉజ్వల స్థాయికి ఎదగాలి




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 5**
ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉత్తమ మార్కులతో ఉజ్వల స్థాయికి ఎదగాలని యం ఈ ఓ పి, ఆంజినేయులు అన్నారు. గురువారం స్థానిక రెయిన్బో హై స్కూల్లో జరిగిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. స్థానిక రెయిన్బో పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ నిఖీలాకిరణ్ అధ్యక్షతన వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా యం ఈ ఓ అంజనేయులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించి, తల్లి దండ్రులకు, తాము చదువుకున్న హైస్కూలుకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్ లో అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హైస్కూల్ చైర్మన్ దొంతా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ బంగారు భవిష్యత్ కి మంచి చదివే మార్గం అని అందరూ బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని , నేడు జరుగుతున్న వీడ్కోలు రేపటి ఉన్నత భవిష్యత్తుకు స్వాగతం అని అన్నారు.పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఎంఇఓ పాఠశాల యాజమాన్యం పరీక్ష ప్యాడ్ లను అందించి ఆశీర్వదించారు.కార్యక్రమంలొ కరాస్పాండెంట్ దొంత కిషోర్ గౌడ్, సిబ్బంది షేక్ సలీం, కొమ్ము రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల పట్ల శక్తి యాప్ రక్షణ కవచం



**దొనకొండ ఫిబ్రవరి 5 పెన్ పవర్**
మండల కేంద్రంలో స్థానిక మహిళా సమైక్య ఆఫీసు నందు మండల స్థాయి గ్రామ సంఘాల సోషల్ ఎలక్షన్ కమిటీ ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపిఎం గుడిమెట్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత నిర్వహించడం జరిగింది. మండల ఎస్సై టీ త్యాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారు. మండల స్థాయిలో ఒక పోలీస్ స్టేషన్ ఉంటుంది ఆస్తి గాని ప్రాణ నష్టం గానీ జరగకుండా పోలీస్ వ్యవస్థ బలోపేతం గా పనిచేస్తుంది. మహిళలకు సంబంధించిన చట్టాలు చాలా కఠినమైనవి ఎక్కడైనా సరే గ్రామస్థాయిలో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించినటు వంటి ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించేటు వంటి చట్టాలు రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తుంది అని తెలియజేశారు. అలాగే మహిళలు మరియు విద్యార్థులు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం వస్తుంది అప్పుడు ఏ రకంగా ఎక్కడైతే మహిళ ఉందో వెంటనే పోలీస్ ఎస్కార్ట్ అక్కడికి వచ్చి పోలీస్ డిపార్ట్మెంట్ మహిళలను రక్షించడం జరుగుతుంది. ఏపిఎం మాట్లాడుతూ ప్రతినెల స్వయం సహాయక సంఘం మీటింగ్లను గ్రామ సంఘం మీటింగ్ లోను కచ్చితంగా సోషల్ ఎలక్షన్ కమిటీ వారు జంట అంశాల్ని ప్రస్తావించి కుటుంబాలు జరుగుతున్న మహిళలపై అగాయిత్యాలను అరికట్టడానికి గ్రామస్థాయి సోషల్ యాక్షన్ కమిటీ చాలా యాక్టివ్ గా తెలియ పరిచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సంఘాల నుండి సోషల్ ఎలక్షన్ కమిటీ సభ్యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి

**విద్యార్థి దశ నుంచే బ్యాంకుల లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి.**

**అల్లినగరం లోని హై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించిన కొమరోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ ఫరూక్.**



**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 5**
నేటి సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరగాళ్ల ఆగడాల పట్ల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరోలు యూనియన్ బ్యాంకు మేనేజర్ షేక్ అబ్దుల్ ఫరూక్ పేర్కొన్నారు. బ్యాంకుల లావాదేవీలు ,సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం కొమరోలు మండలం అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ అధ్యక్షత వహించగా, కొమరోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశ నుంచే బ్యాంకుల లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తీరిక సమయాలలో బ్యాంకులను సందర్శించి బ్యాంకులలో జరిగే లావాదేవీలు ,నగదు పొదుపు, బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు అందుతున్న సేవలు ,ప్రభుత్వ పథకాలపై బ్యాంకు అధికారుల ద్వారా తెలుసుకొని అవగాహన పెంచుకోవాలన్నారు .ప్రతి విద్యార్థి బ్యాంకులలో ఖాతాలు ప్రారంభించుకొని బాల్యం నుంచే పొదుపు చేసే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో సైబర్ నేరగాళ్ల ఆగడాలు, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు మితిమీరిపోతున్నాయని, అందువల్ల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ అధికారులు అంటూ ఫోన్లు చేస్తూ ఓటిపి నెంబర్లు, ఖాతా నెంబర్లు, ఆధార్ కార్డు నెంబర్లు తదితర వాటిని మోసగాళ్లు అడుగుతూ ఉంటారని, అయితే బ్యాంక్ అధికారులు ఎవరూ కూడా తమ ఖాతాదారులకు ఫోన్లు చేయరని వివరాలు అడగరనే వాస్తవాన్ని అందరూ గమనిస్తూ మోసగాళ్ల వలలో పడవద్దని ఆయన సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ మోసాలకు గురైన అనేకమంది యువకులు చేసిన అప్పును తీర్చుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటూ తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిలిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొమరోలు లోని యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నదని ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ చేస్తూ వారి భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తున్నదని ఆయన వివరించారు. ఆ సందర్భంగా విద్యార్థులకు అనేక ప్రశ్నలు వేసి వాటికి సరైన సమాధానాలు ఇచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ మాట్లాడుతూ బ్యాంకుల లావాదేవీలు, బ్యాంకులు అందిస్తున్న సేవలు, పొదుపు పద్ధతులపై విద్యార్థులు అవగాహన పెంచుకొని ఆర్థిక నేరగాళ్ల మాయమాటలకు గురి కావద్దని ఆమె తెలిపారు. తమ పాఠశాలలో సమావేశం నిర్వహించి విద్యార్థులకు మంచి సూచనలు సలహాలు ఇవ్వటమే కాకుండా వారు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించిన యూనియన్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ ఫరూక్ కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్ రాజు, పిచ్చయ్య, చంద్రమోహన్, శివరాం, హరి కుమార చౌదరి ,కృష్ణమూర్తి, ఆదిలక్ష్మి ,శ్రీనివాసులు, బోధనేతర సిబ్బంది పకీరయ్య ,అశ్వినీ దేవి, విద్యార్థిని విద్యార్థులు యూనియన్ బ్యాంక్ సిబ్బంది కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ డిమాండ్ల సాధనకై ధర్నా పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 5**
అఖిలభారత ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి కార్యచరణ కమిటీ పిలుపుమేరకు గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జె. వెంకట్రావు, ఎస్టీయూ సీనియర్ నాయకులు బి. వెంగళరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై భారం పెంచుతున్న విధానాలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. టెట్ ను రద్దు చేయాలని, సీపీఎస్ ను రద్దు చేయాలని, అలాగే ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుండి మినహాయించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనాలను అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు.

# వెలుగు కార్యాలయంలో జెండర్ పై విఓఏ, ఈసీలకు శిక్షణ

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై వెంకటేశ్వర నాయక్**







**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 5**
మండల కేంద్రంలోని సి ఎస్ పురం వెలుగు కార్యాలయంలో గురువారం జెండర్ అంశంపై విఓఏలు, ఈసీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై వెంకటేశ్వర నాయక్ హాజరై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన మహిళల భద్రతకు కీలకమని తెలిపారు. సైబర్ నేరాలు, జెండర్ వివక్షత, బాల్యవివాహాల నిరోధక చట్టం, పి.ఓ.ఎస్.హెచ్ చట్టం, మహిళలపై జరిగే అత్యాచారాలు మరియు హింసకు సంబంధించిన చట్టాలు, పిఓస్కో చట్టం అంశాలపై వివరించారు. సైబర్ నేరాలు జరిగినట్లయితే వెంటనే 1930 నంబరు సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అలాగే సంఘాలు, సమావేశాల సందర్భంగా ఈ అంశాలపై చర్చలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మహిళల హక్కులు, భద్రతపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనారాయణ, సిసిలు, వివోఏలు తదితరులు హాజరయ్యారు.

# కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి5**
మండల పరిధిలోని వై.చర్లోపల్లిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైస్సార్సీపీ కార్యకర్త వార్డు నెంబర్ జంగాల హనుమంత్ యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ గురువారం పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానిక నాయకులు, మరియు వారి కుటుంబ సభ్యులను అడిగి దాడికి గల కారణాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన టీడీపీ వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా డిమాండ్ చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదంటూ, కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ గంటా వెంకటరమణ రెడ్డి. ఎంపీపీ గుమ్మా యలేష్ పద్మజ. వైఎస్ఆర్సిపి నాయకులు అల్లు రాంభూపాల్ రెడ్డి. నియోజవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు వెన్న వెంకటేశ్వర రెడ్డి. నియోజవర్గ సియుటి అధ్యక్షులు షేక్ షేక్షావలి. యూత్ నాయకులు రంగారావు వైయస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గ కోనరెడ్డి వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో భోజనాల ఏర్పాటు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 5**
మండలంలోని బొంతవారిపల్లి గ్రామానికి చెందిన దివంగత దుగ్గ కోనరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన మనుమరాలు దుగ్గ సరళ గురువారం కనిగిరిలోని వాసవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనాలు అందజేసి,మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచారు.వృద్ధాశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, దుగ్గ కోనరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని అలాగే వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# తడి చెత్త పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలి -జడ్పీ సీఈవో చిరంజీవి



**పొన్నలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 5**
మండలంలోని విప్పగుంట, భోగనంపాడు ,రాజోలపాడు, కే అగ్రహారం గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను గురువారం జడ్పీ సీఈవో చిరంజీవి పరిశీలించారు. తడి చెత్త పొడి ,చెత్త ,ప్రమాదకర చెత్త గురించి హరితరాయబారులకు చిరంజీవి అవగాహన కల్పించారు. గ్రామాలలో ఇంటింటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని గ్రామ ప్రజలతో ఆరా తీశారు. తడి చెత్త పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలని కోరారు. ఆరు వేల మందికి ఆరు క్లాప్ మిత్రాలు ఉండాలని కానీ టూ షార్ట్ ఏజ్ ఉన్నందున కొత్త వారిని నియమించుకోమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు గీత, చంద్రకళ, నారాయణ, నాయకులు ఉన్నం కొండలరావు, రమణయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



**పుల్లల చెరువు పెన్ పవర్ ఫిబ్రవరి 5**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని పుల్లల చెరువు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.గురువారం మల్లపాలెం జాతీయ రహదారి (ఎన్‌హెచ్--565) పరిధిలో చేపట్టిన రోడ్డు భద్రత చర్యలను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక వేగం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నియంత్రించేందుకు మల్లపాలెం జాతీయ రహదారిపై పలుచోట్ల రేడియం స్టికర్లు అంటించిన డ్రమ్‌లు ఏర్పాటు చేసి, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందిస్తున్నామని తెలిపారు.రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా ఈ ఏర్పాట్లు చేశామని, తద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.యాండ్రపల్లి, మల్లపాలెం, మురికిమల్ల ప్రాంతాల్లో వేగ నియంత్రణకై స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, రహదారులపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం తప్పనిసరి అని హెచ్చరించారు.కేవలం రోడ్డు ప్రమాదాల నివారణకే కాకుండా, నేర నియంత్రణలో కూడా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.గ్రామస్థాయి నుంచే ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణ చర్యలు చేపట్టేందుకు పోలీస్ శాఖ సన్నాహాలు చేస్తోందన్నారు.గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే రోడ్డు భద్రత, నేర నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని ఎస్సై పిలుపునిచ్చారు.పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గి, ప్రజలు సురక్షితంగా ప్రయాణించే వాతావరణం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సజ్జల రామకృష్ణ రెడ్డి ని కలిసిన.. మాజీ ఎమ్మెల్యే కదిరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 5**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషనపై చంద్రబాబు ప్రభుత్వం వైఖరికి నిరసనగా గురువారం ఆధ్వర్యంలో చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. మార్గమధ్యలో నందికొట్కూరు దగ్గర రాష్ట్ర రిజినల్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డిని కదిరి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమం లో స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి,సియస్ పురం మండల వైసీపి అధ్యక్షుడు పాలగుళ్ల మల్లికార్జున్ రెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి,ఆనికాలపల్లి ,ఉప్పలపాడు సర్పంచ్ లు చెరుకుపల్లి రాధాకృష్ణ రెడ్డి,వై ప్రవీణ్ కుమార్,వైసీపీ సీనియర్ నాయకుడు సిద్దు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు .

# రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవు

## పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్

**పొదిలి, పెన్ పవర్ , ఫిబ్రవరి 5**

వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కొనకనమిట్ల ఎస్. ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం పట్టణంలోని విశ్వనాథపురం సెంటర్లో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ శ్రీకాంత్ పలు వాహనాలను ఆపి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు లైసెన్సును కూడా తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీకాంత్ తో పాటు సిబ్బంది కూడా పాల్గొన్నారు.



# ఈ నెల 14,15 న పాకల బీచ్ ఫెస్టివల్

## – జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు





**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 05**

ప్రకాశం జిల్లాలో పాకల బీచ్ ఫెస్టివల్ ను ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు అద్భుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు పాకల బీచ్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు తో కలసి పాకల బీచ్ ను సందర్శించి బీచ్ ఫెస్టివల్ నిర్వహణలో భాగంగా చేపట్టవలసిన ఏర్పాట్లు పై సంబంధిత అధికారులతో సమావేశమై తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసారు. జిల్లలో తొలిసారిగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పాకల బీచ్ ఫెస్టివల్ ను అద్భుతంగా నిర్వహించేందుకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య ఏర్పాట్లు, పార్కింగ్ నిర్వహణ, తాగునీటి వసతి, బందోబస్తు ఏర్పాట్లు పై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా క్రీడలు, మౌలిక వసతులు కల్పించాలి. సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, లేజర్ షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందుగానే ఏర్పాట్లు చేయాలని, స్థానిక వంటకాలతో కూడిన ప్రత్యేక ఫుడ్ కోర్టు లను నిర్వహించాలి' అని సూచించారు. సందర్శకులకు ఇబ్బంది కలగకుండా రెండు రోజులు ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్, ఆర్ టి సి అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య ఏర్పాట్లు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, , విద్యుత్ శాఖ ఎస్ ఈ వెంకటేశ్వర రావు, ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు, మత్స్య శాఖ జెడి శ్రీనివాస రావు, పర్యాటక శాఖ అధికారి శ్రీరమ్య, వివిధ శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితులకు 'జీవిత ఖైదు'

## తీర్పు వెలువరించిన ఒంగోలు మూడవ అదనపు జిల్లా కోర్టు

## పోలీస్ అధికారులను అభినందించిన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 5:**

భూ వివాదం నేపథ్యంలో వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఇద్దరు నిందితులకు ఒంగోలు మూడవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ గురువారం సంచలన తీర్పు వెలువరించినట్లు జె. పంగులూరు ఎస్.ఐ వినోద్ బాబు తెలిపారు.

**కేసు వివరాల్లోకి వెళ్తే...:** జె.పంగులూరు మండలం, కొండమూరు గ్రామానికి చెందిన చిలమకూరి. అనంతరెడ్డి (33), అదే గ్రామానికి చెందిన చిలమకూరి. వెంకట కృష్ణారెడ్డి అలియాస్ పెద్ది. కృష్ణారెడ్డి (ఎ1) మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మృతుడు నిర్మించిన కాంపౌండ్ వాల్ విషయంలో కృష్ణారెడ్డి పగ పెంచుకున్నాడు. 2019 ఏప్రిల్ 8వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో అనంతరెడ్డి తన స్నేహితుడితో కలిసి బైక్ పై రేణంగివరం నుంచి కొండమూరు వెళుతుండగా, బీమనాడం. దిలీప్ రెడ్డి (ఎ2) కావాలని అడ్డగించాడు. వెంటనే ఎ1, ఎ2 లు ముందస్తు పథకం ప్రకారం ఇనుప రాడ్లతో అనంతరెడ్డి తల, ముఖంపై దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ ఘటనపై అప్పట్లో జె.పంగులూరు ఎస్.ఐ కె. అజయ్ కుమార్ కేసు నమోదు చేయగా, అప్పటి ఇంకొల్లు సీ.ఐ (ప్రస్తుత ఒంగోలు రూరల్ సీ.ఐ) మద్దినేని. శేషగిరి రావు కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించారు. అనంతరం ఇన్స్పెక్టర్ ఆర్. రాంబాబు చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.వి. రమేశ్వర్ రెడ్డి వాదనలు వినిపించారు. నేరం నిరూపితం కావడంతో జడ్జి ఏ. పూర్ణిమ నిందితులు ఇద్దరికీ జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. 5,000/- జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



**సిబ్బందికి ప్రశంసలు...:** కేసులో పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించి, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. అద్దంకి రూరల్ సీ.ఐ డి. మల్లికార్జునరావు, జె.పంగులూరు ఎస్.ఐ బి. వినోద్ బాబు, ఏఎస్సైలు ఎం. కోటేశ్వర రావు, డి. శ్రీనివాసరావు, కోర్టు లైజన్ సిబ్బంది ఉన్నారు.

# ఉపాధి హామీ మార్పులకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన

## -100 రోజులు సరిపోవు...

## 200 రోజులు కావాలి: ఉపాధి కూలీల డిమాండ్.






**వి.ఆర్.పురం, ఫిబ్రవరి 5:( సిటిజన్ టైమ్స్ ప్రతినిధి )**

ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులను వెంటనే ఉపసంహరించుకుని, పాత చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, ఉపాధి హామీ కూలీలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ విధానం వల్ల నెట్‌వర్క్ సమస్యలు తలెత్తి కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని, పాత మస్టర్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 100 రోజులకు పరిమితం కాకుండా పని దినాలను 200 రోజులకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, రోజువారీ కనీస వేతనం రూ.600 చెల్లించాలని కోరారు. గ్రామీణ పేదలకు ఆధారమైన ఉపాధి హామీ పథకాన్ని బడ్జెట్ కోతలతో నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఓ కొండబాబుకు, మండల అభివృద్ధి అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, రైతు సంఘం, గిరిజన సంఘాల నాయకులు, సిపిఎం సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొన్నారు. డిమాండ్లు నెరవేరకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# వై సి పి ప్రభుత్వము టీ టీ డి లడ్డు కల్తీ సంప్రోక్షణ బీజేపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 5**

భారతీయ జనతా పార్టీ జాతీయ,రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పిలుపు మేరకు బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో గత ప్రభుత్వము తిరుమల తిరుపతి దేవస్థానము భక్తులకు పవిత్రమైన లడ్డు కల్తీ నెయ్యి తో అపవిత్రము చేయడం కు నిరసనగా గిద్దలూరు పట్టణ సాయి బాబా ఆలయం లో సం ప్రోక్షణ చేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ జె వి నారాయణ మాట్లాడుతూ వై సి పి ప్రభుత్వం చేసిన కల్తీ నెయ్యి హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీయడము కలియుగ దైవము శ్రీవేంకటేశ్వర స్వామి కోపాగ్ని తో గతము లో వై సి పి ప్రభుత్వం అధిక మెజారిటి తో గెలుపొంది ప్రస్తుతము కేవలము 11 సీట్ లకు పడిపోయంది అని కావున ఇప్పటికైనా వై సి పి నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు,, మాజీ జిల్లా కార్య వర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, జనార్దన్, మాజీ బి జె వై ఎం ఉపాధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

# ఏసీ రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్లకు షాపుల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి : రమేష్

**మాచర్ల సిటీజన్ టైమ్స్ ఫిబ్రవరి 05**

పట్టణంలో ఏసీ రిఫ్రిజిరేషన్ వృత్తి పై జీవనం సాగిస్తున్న టెక్నీషియన్లను ప్రభుత్వం గుర్తించి షాపుల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని ఏసీ రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్ల యూనియన్ ఉమ్మడి గుంటూరు జిల్లాల సలహాదారుడు దాసరి రమేష్ కోరారు. వెల్దుర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కరోనా నుండి కాలం కలిసి రాక ఏసీ రిప్రజరేషన్ టెక్నీషియన్ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంత షాపులు లేక, వేలకు వేలు అద్దెలు కట్టలేక పూట గడవని పరిస్థితుల్లో



కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి కరువై పలువురు టెక్నీషియన్ లు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు లేకపోలేదన్నారు. టెక్నీషియన్ లను ఆదుకోవాలని పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ దేరంగుల వీరాంజనేయులు మాట్లాడుతూ టెక్నీషియన్ లను కార్మికులుగా గుర్తించి ప్రభుత్వ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించాలన్నారు. టెక్నీషియన్లను ఆర్థికంగా ఆదుకునేందుకు ముద్ర లోన్లు మంజూరు చేయాలన్నారు. వినతిపత్రంపై స్పందించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పట్టణంలో టెక్నీషియన్ లకు స్థలాన్ని కేటాయించేలా ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ బాజీ, నరసింహారావు, సైదులు, షాకీర్, మీరావలి, పండు, జాకీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

